మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310

ఘనంగా ఏపి ఎలక్ట్రికల్స్ ప్రారంభోత్సవం



3లో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 207 | శనివారం | 31 - 01 - 2026 | పేజీలు: 8 | వెల: 4



## అసలు పని ఇప్పుడే మొదలైంది

- ఇచ్చిన హామీల అమలే ప్రభుత్వ ధ్యేయం
- యువతతో 'హలో లోకేశ్' ముఖాముఖి
- నైతిక విలువలతోనే ఏపీ అగ్రగామి
- మంత్రి నారా లోకేశ్

మన గళం, కాకినాడ : ప్రభుత్వంలోకి రావడంతోనే తమ పని పూర్తికాలేదని, అసలు పని ఇప్పుడే మొదలైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. శుక్రవారం కాకినాడలోని జేఎన్టీయూ కాకినాడలో 'హలో లోకేశ్' పేరిట నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థిని ప్రాప్తి యాంకర్‌గా వ్యవహరించారు. జీవితంలో తీసుకునే కొన్ని నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని, తన జీవితంలో పాదయాత్ర అలాంటి కీలక నిర్ణయమని లోకేశ్ అన్నారు. పాదయాత్ర ద్వారా కోట్లాది మంది ప్రజలు, యువత ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభించిందని, ఆ అనుభవాలనే ఇప్పుడు ప్రభుత్వ విధానాలుగా అమలు చేస్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే యువతకు నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పించామని మంత్రి వెల్లడించారు. అభివృద్ధి



2 లో..



## ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు కలకలం

- అహ్మదాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్
- ప్రయాణికులందరూ సురక్షితం
- భద్రతా తనిఖీల అనంతరం విమానం అనుమతి

మన గళం, అహ్మదాబాద్ : కువైట్ నుంచి ఢిల్లీకి వస్తున్న ఇండిగో విమానాన్ని శుక్రవారం ఉదయం అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. విమానాన్ని హైజాక్ చేస్తున్నామని, బాంబు పెట్టామంటూ ఒక నోట్ కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయం ఆరు గంటల నలభై నిమిషాల సమయంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ విమానంలో మొత్తం నూరు ఎనభై మంది

2 లో..

## రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి ప్రధాని నివాళులు



- గాంధీ సిద్ధాంతాలు దేశ ప్రయాణానికి మార్గదర్శకాలు
- న్యాయం, సమరసత, మానవసేవే లక్ష్యంగా భారత్
- గాంధీ సూత్రాల పట్ల నిబద్ధత పునరుద్ఘాటన

మన గళం, న్యూఢిల్లీ : దేశ పితామహుడు మహాత్మా గాంధీ కి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్‌ఘాట్‌లో ఘన నివాళులు అర్పించారు. గాంధీ స్మారక స్థలంలో పుష్పాలు సమర్పించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గాంధీ జీవితం, ఆయన త్యాగాలు దేశానికి శాశ్వత ప్రేరణగా నిలుస్తాయని ప్రధాని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ప్రతిపాదించిన అహింస, సత్యం, న్యాయం వంటి శాశ్వత సిద్ధాంతాలు నేటికీ భారతదేశ ప్రయాణానికి మార్గదర్శకాలుగా

2 లో..

## ప్రకాశం జిల్లాలో గూడ్స్ రైలు ప్రమాదం



- విజయవాడచెన్నై ప్రధాన మార్గంలో రాకపోకలకు అంతరాయం

మన గళం, ప్రకాశం జిల్లా : ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఈ

2 లో..

## తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కుట్ర



బీఆర్ నాయుడు సంచలన ఆరోపణలు

మన గళం, తిరుపతి : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ప్రాణాంతక రసాయనాలు కలిపి హిందువుల ప్రాణాలతో చెలగాటమాడేందుకు గత వైసీపీ ప్రభుత్వం పథకం ప్రకారమే కుట్రకు పాల్పడిందని తిరుమల తిరుపతి దేవస్థానాలు చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు (బీఆర్ నాయుడు) సంచలన ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ దాఖలు చేసిన ఫైనల్ చార్జ్‌షీట్‌తో

2 లో..

## పుట్టిన గడ్డను మరవని ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం

- గుంటూరు జీజీహెచ్‌లో 'కానూరిజింఖానా' మాతాశిశు కేంద్ర ప్రారంభం
- పేదల అభ్యున్నతికే పీ4 కార్యక్రమం
- అమరావతి, గుంటూరు అభివృద్ధిపై ధీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మన గళం, గుంటూరు : ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మరచిపోకుండా ప్రవాసా ంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదా యకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి లో గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'కానూరిజింఖానా' మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్ర నిర్మాణానికి పూర్వ విద్యార్థులు రూ.100 కోట్లు విరాళంగా సమ



కూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు

2 లో..

## ఉపాధి హామీ చట్ట పునరుద్ధరణకు ఫిబ్రవరి 2 నుంచి పరిరక్షణ యాత్ర

మన గళం, అనంతపురం : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలనే డిమాం డ్‌తో ఫిబ్రవరి 2 నుంచి చేపట్టనున్న ఉపాధి హామీ పరిరక్షణ యాత్రపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇంచార్జీలు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా



8 లో..

## వింగ్స్ ఇండియా ప్రదర్శనలో విమానయాన భవిష్యత్ దర్శనం



- పరిశ్రమ నేతలు, స్టార్టప్‌లతో పరస్పర చర్యలు
- హెలికాప్టర్ సిమ్యులేటర్ ప్రత్యేక ఆకర్షణ
- గ్లోబల్ విమానయాన కేంద్రంగా భారత్ దూసుకుపోతోంది

మన గళం, న్యూఢిల్లీ : వింగ్స్ ఇండియా విమానయాన ప్రదర్శనలో పాల్గొనడం ఒక గొప్ప, ఆహ్లాదకర అనుభవమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు కింజరాపు

2 లో..

# ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు కలకలం



ప్రయాణికులు ఉన్నారు. ల్యాండింగ్ అయిన వెంటనే అందరినీ విమానం నుంచి దిగమని సూచించి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం ప్రయాణికుల బ్యాగేజీతో పాటు విమానాన్ని కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్థాయీ బెదిరింపుల స్పందన ప్రోటోకాల్ ప్రకారం ఒక్కొక్క ప్రయాణికుడిని భద్రతా సిబ్బంది పరిశీలించినట్లు అధికారులు వెల్లడించారు. భద్రతా తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులంతా క్షేమంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని తెలిపారు. తనిఖీల ప్రక్రియ పూర్తైన అనంతరం తిరిగి విమానం ప్రయాణానికి అనుమతి ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనతో కొంతసేపు అహ్మదాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదే తరహా ఘటన ఈ నెల ఇరవై రెండవ తేదీన కూడా చోటుచేసుకుంది. ఢిల్లీపుణె మార్గంలో ప్రయాణిస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో పుణె విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే దానిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆ సమయంలో కూడా భద్రతా ఏజెన్సీలు విస్తృతంగా తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఇటువంటి వరుస ఘటనలతో విమానయాన భద్రతపై మరింత అప్రమత్తత అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

# రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి ప్రధాని నివాళులు



కొనసాగుతున్నాయని ప్రధాని తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య గాంధీ ఆలోచనలు మరింత ప్రాసంగికంగా మారాయని ఆయన అభిప్రాయ పడ్డారు. న్యాయం, సమరసత, మానవసేవ పునాదులపై నిలిచిన భారతదేశాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడి జీవితంలో గాంధీ సూత్రాలు ఆచరణలోకి రావాలని, అప్పుడే సమాజం నిజమైన పురోగతిని సాధిస్తుందని పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాల పట్ల దేశం తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించిందని ప్రధాని తెలిపారు. గాంధీ చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజ్‌ఘాట్ వద్ద ఏర్పడిన వాతావరణం గాంధీ స్మృతులతో గంభీరంగా మారింది.

# వింగ్స్ ఇండియా ప్రదర్శనలో విమానయాన భవిష్యత్ దర్శనం




అన్నారు. భారత పౌర విమానయాన రంగం విస్తృతి, వైవిధ్యం, ఆశయాలను ఈ వేదిక అద్భుతంగా ప్రతిబింబించిందని ఆయన పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా మాత్రమే కాకుండా, సంపూర్ణమైన గ్లోబల్ విమానయాన వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న దిశను ఈ ప్రదర్శన స్పష్టంగా చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో అనేక ప్రదర్శన స్టాళ్లను సందర్శించి పరిశ్రమ నేతలు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లతో నేరుగా మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్ విమానయానాన్ని తీర్చిదిద్దుతున్న ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ప్రేరణనిచ్చాయని అన్నారు. ముఖ్యంగా ఆధునిక శిక్షణ సామర్థ్యాలను ప్రతిబింబించే హెలికాప్టర్ సిమ్యులేటర్‌ను స్వయంగా ప్రయత్నించడం ప్రత్యేక అనుభవంగా నిలిచిందన్నారు. ప్రదర్శనలో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, పవన్ హాన్స్ సహా అనేక దేశీ, విదేశీ సంస్థల స్టాళ్లను సందర్శించినట్లు రామ్ మోహన్ నాయుడు తెలిపారు. తయారీ, మరమ్మతులు, డ్రోన్లు, శిక్షణ, స్థిరత్వం, విమానాశ్రయ మౌలిక వసతుల రంగాల్లో జరుగుతున్న ఆధునిక ఆవిష్కరణలు భారత్ విమానయాన శక్తిగా ఎదుగుతున్నదానికి నిదర్శనమని చెప్పారు. నూట ఇరవైకిపైగా దేశాల ప్రతినిధులు, ప్రపంచంలోని ప్రధాన విమానయాన సంస్థల పాల్గొనడం భారత విమానయాన రంగ వృద్ధిపై ప్రపంచానికి ఉన్న విశ్వాసాన్ని చాటుతుందని మంత్రి అన్నారు.

# ప్రకాశం జిల్లాలో గూడ్స్ రైలు ప్రమాదం

ఘటనలో గూడ్స్ రైలుకు చెందిన పలువురు వ్యాగన్లు అదుపు తప్పి పక్కనే ఉన్న రెండు రైల్వే ట్రాక్‌లపై పడిపోయాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో వ్యాగన్లు పడిపోవడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రైల్వే శాఖ అధికారులు, సాంకేతిక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్లు, ఇతర యంత్రాలతో పట్టాలు తప్పిన వ్యాగన్లను తొలగించే పనులు ప్రారంభించారు. ట్రాక్ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భద్రతా చర్యలతో పాటు రైల్వే సిబ్బంది అప్రమత్తంగా పనిచేస్తున్నారు. గూడ్స్ బోగీలు పట్టాలు తప్పిన కారణంగా విజయవాడచెన్నై ప్రధాన రైల్వే మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు వివిధ స్టేషన్లలో నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని రైళ్లను మళ్లింపు మార్గాల ద్వారా నడిపే అవకాశం ఉందని అధికారులు పరిశీలిస్తున్నారు. రైల్వే ట్రాక్ పూర్తిగా పునరుద్ధరించేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రయాణికులు రైళ్ల స్థితిగతులపై ముందస్తు సమాచారం తెలుసుకుని ప్రయాణాలు చేయాలని రైల్వే శాఖ సూచించింది. ఈ ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

# అసలు పని ఇప్పుడే మొదలైంది






వికేంద్రీకరణ, క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థుల సూచనలు, అభిప్రాయా లను తెలుసుకునేందుకు ఇకపై ప్రతి నెలా విద్యార్థులతో సమా వేశాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకుని పాఠ్యప్రణాళికల మెరు గుదలకు ఉపయోగిస్తామని హామీ ఇచ్చారు. సీఎస్ఆర్ తరహాలో పరిశ్రమలు కూడా పరిశోధనలకు నిధులు కేటాయించాలని సూచించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా నైతిక విలువలను మరవకూడదని విద్యార్థులకు హితవు పలికారు. పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని, నైతిక విలువలు నేర్పించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును ప్రభుత్వ సలహాదారుగా నియమించామని తెలిపారు. ఆయనకు కేబినెట్ ర్యాంకు ఇచ్చినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సదుపాయాలు తీసుకోవడం లేదని గుర్తుచేశారు. 'అమ్మకు చెప్పలేని పని మనం చేయకూడదు' అనే చాగంటి మాట ఎంతో శక్తివంతమైనదని పేర్కొంటూ, ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టాలన్న లక్ష్యంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని, వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

# పుట్టిన గడ్డను మరవని ప్రవాసాంధ్రుల సేవలు స్ఫూర్తిదాయకం





వెచ్చించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదన్నారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లిన వారు జన్మభూమిని మరచిపోతారని, అయితే మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సహాయం చేయడం అభినందనీయమని ప్రశంసించారు. భవన నిర్మాణంతో పాటు భవిష్యత్తులో నిర్వహణకు ఇబ్బందులు రాకుండా బ్యాంకులో నిధులు డిపాజిట్ చేయడం మీ ముందుచూపుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించేందుకే 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని ప్రారంభించామని చంద్రబాబు వివరించారు. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయని, చదువు ఒక గేమ్ ఛేంజర్ అని చెప్పారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని 2.2 లక్షల మంది దాతలు దత్తత తీసుకున్నారని, ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయని, 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ రానుందని తెలిపారు. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, 'క్వాంటమ్ వ్యాలీ'తో కొత్త దిశ చూపిస్తున్నామని అన్నారు. అలాగే టెక్నాలజీ ఆధారంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని, 2026 నాటికి డ్రోన్ అంబులెన్సులు తీసుకురావడమే లక్ష్యమని వివరించారు. గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ కేంద్రంలో 600 పడకలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కుట్ర

ఈ మహా కుంభకోణం బట్టబయలైందని, ఇది స్లో పాయిజన్ ద్వారా హిందువులను హతమార్చే ప్రయత్నమేనని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, సిట్ నివేదికలో తమకు క్లీన్‌చిట్ వచ్చిందని వైసీపీ నేతలు సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. వాస్తవానికి 2019 నుంచి 2024 మధ్య కాలంలో టీటీడీకి సరఫరా అయిన సుమారు 60 లక్షల కిలోల నెయ్యి కల్తీ అని సిట్ చార్జ్‌షీట్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈ రూ.250 కోట్ల విలువైన కల్తీ నెయ్యితో దాదాపు 20 కోట్ల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారని, ఇది కోట్లాది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పాల సేకరణ సామర్థ్యం కూడా లేని ఉత్తరాఖండ్‌కు చెందిన బోలే బాబా ఆర్గానిక్ డెయిరీ సంస్థకు నిబంధనలు మార్చి కాంట్రాక్ట్ కట్టబెట్టారని బీఆర్ నాయుడు ఆరోపించారు. "చుక్క పాలు లేకుండా లక్షల కిలోల నెయ్యి ఎలా వస్తుంది? పామాయిల్, ప్రాణాంతక రసాయనాలు, జంతు కొవ్వు (టాలో) కలిపి సింథటిక్ నెయ్యి తయారు చేసి శ్రీవారి ప్రసాదంలో వాడారు. ఎన్‌డీడీబీ నివేదికతో పాటు సిట్ రిపోర్ట్‌లోనూ నెయ్యిలో జంతు కొవ్వు ఉన్నట్లు స్పష్టంగా ఉంది. ఇది హిందువులపై జరిగిన దాడి కాదా?" అని ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందని, తిరుమల ప్రతిష్ఠను దిగజార్చేందుకు అన్యమత శక్తులు ప్రయత్నించగా అప్పటి పాలకులు వారికి సహకరించారని ఆరోపించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## త్రియంభకేశ్వర స్వామి ను దర్శించుకున్న గుమ్మనూరు నారాయణ, కమలమ్మ దంపతులు






(ఆలూరు మనగళం): కర్నూలు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అక్కంతోట రామకృష్ణ ప్రత్యేక ఆహ్వానం మేరకు కౌతాళం మండల కేంద్రంలో స్థానికంగా వెలిసిన శ్రీ త్రియంభకేశ్వర ఆలయ మూడవ వార్షికోత్సవంలో మరియు శివ పార్వతి కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ గుమ్మనూరు కమలమ్మ పాల్గొని, అనంతరం అక్కంతోట రామకృష్ణ గుమ్మునూరు నారాయణ, గుమ్మనూరు కమలమ్మ దంపతులు శ్రీ త్రీయంభకేశ్వర స్వామి ఆలయం నందు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బిజెపి నాయకులు, కార్యకర్తలు, గుమ్మనూరు నారాయణ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ రాజకీయ నేతలకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేసిన టీడీపీ యువనేత గిరి మల్లేష్ గౌడ







(ఆలూరు మనగళం): ఆలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్చార్జి వీరభద్ర గౌడ సోదరులు కీ,శే, కుమార్ గౌడ తనయుడు చి, మల్లికార్జున గౌడ వివాహ మహోత్సవానికి పలువురు ప్రముఖ రాజకీయ నేతలకు వివాహ మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేసిన టిడిపి యువనేత గిరి మల్లేష్ గౌడ. ఈ సందర్భంగా యువనేత గిరి మల్లేష్ గౌడ మాట్లాడుతూ, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మరియు సుజాతమ్మ, మాజీ మంత్రి గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుగ్గలి నాగేంద్ర మరియు ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ లను మా చిన్నాన్న కీ,శే, కుమార్ గౌడ తనయుడు మా సోదరులు చి, మల్లికార్జున గౌడ వివాహ మహోత్సవానికి మీరందరూ తప్పకుండా రావాలని ప్రతి నాయకులను మనసారా ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆలూరు మాజీ ఇంచార్జి వీరభద్ర గౌడ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపి ఎలక్ట్రికల్స్ ప్రారంభోస్తవం



కర్నూలు : స్థానిక కర్నూలు నెహ్రు రోడ్డు నందు ఏపీ ఎలక్ట్రికల్స్ షాప్ ప్రారంభోస్తవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండస్ట్రియల్ కామర్స్ మంత్రివర్యులు ౧+. భరత్ హాజరై రిబ్బన్ కటింగ్ చేసి షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కర్నూలు లోని ఏపీ ఎలక్రికల్స్ యాజమాన్యం సరసమైన ధరలతో సామాన్యుడికి అందుబాటులో ఉండే బ్రాండెడ్ ఎలక్ట్రికల్ వస్తువులు ఉత్పత్తి చేయడానికి సింద్ధంగా ఉన్నారని ప్రజలు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని. తెలిపారు. అదేవిధంగా ఏపీ ఎలక్ట్రీకల్స్ యజమానులకు భాగస్వాములకు ఈ వ్యాపారం లో మంచి లాభాలు వచ్చి రాభోయే రోజుల్లో మరిన్ని బ్రాంచ్ లు స్థాపించాలని యువత కు ఆదర్శంగా నిలవాలని తమ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం షాప్ యజమానులైన సుహెల్ ఖాజీ, మరియు వలీలు మాట్లాడుతూ. రాష్ట్ర మంత్రివర్యులు అయిన ౧+. భరత్ గారు తమ షాప్ ప్రారంభించడం తమ అదృష్టమని వారు ముఖ్య అతిధులుగా రావడం తమకు ఎంతో సంతోషకరమైన విషయమని కృతజ్ఞతలు తెలిపారు, తమ షాప్ లో తక్కిన షాపులలో దొరకని బ్రాండెడ్ ఎలక్ట్రికల్ వస్తువులు తమ షాప్ లో అధిక డిస్కోంట్ లతో అందరికి అందుబాటులో ఉండే ధరలతో నాణ్యమైన వస్తువులు లభిస్తాయని ప్రజలు తమ సేవలను ఉపయోగించుకోగలరని తెలిపారు.

## జిరాంజీ పేరును తొలగించాలి సిపిఐ డిమాండ్






మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా పట్టణంలోని స్థానిక పాత బస్టాండ్ నందు గల మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర స్థానిక భారత కమ్యూనిస్ట్ పార్టీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని మహాత్మ గాంధీ విగ్రహం దగ్గర ఆందోళన చేపట్టారు. ముందుగా మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి,కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుండి వ్యవసాయ కార్మికులకు, ఉపాధి కూలీలకు జరిగే నష్టం నుండి కాపాడమని వినతిపత్రం గాంధీ విగ్రహానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేష కుమార్, మండల అధ్యక్షులు రాముడు, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, వెంకటస్వామి హమాలీ సంఘం నాయకులు డాము, రాముడు, రవి,మద్దయ్య, నాయుడు, రమేష్, మహిళా సంఘం నాయకురాలు సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతల నివాళులు



మన గళం మార్కాపురం, జిల్లా : 78వ జాతిపిత మహాత్మా గాంధీ గారి వర్ధంతి (షహీద్ దివస్) సందర్భంగా మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణంలోని గాంధీ పార్కులో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి గారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన త్యాగాల ఫలితంగానే నేడు భారత ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తున్నారని తెలిపారు. 1948 జనవరి 30న నాథురాం గాడ్సే చేతుల్లో జాతిపిత మహాత్మా గాంధీ హత్యకు గురయ్యారని, ఆ రోజు దేశ చరిత్రలో ఒక విషాద దినమని అన్నారు.

ఈ రోజు గాంధీజీతో పాటు దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులందరికీ నివాళులు అర్పించే జాతీయ స్మరణ దినమని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు దేశవ్యాప్తంగా రెండు నిమిషాల మౌనం పాటించి అమరవీరులను స్మరించుకుంటారని తెలిపారు. న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, త్రివిధ దళాధిపతులు గాంధీజీ సమాధికి నివాళులు అర్పిస్తారని చెప్పారు. ఈ రోజు శాంతి, అహింసా దినంగా గాంధీజీ అహింసా సిద్ధాంతాలను గుర్తు చేసుకునే రోజని ఆయన అన్నారు. అయితే ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం గాంధీజీ పేరును ప్రజల మనసుల నుంచి తొలగించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఇందుకు ఉదాహరణగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (మన్రేగ) పేరును మార్చడం జరిగిందని తెలిపారు. యూపీఏ1 ప్రభుత్వ హయాంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో, శ్రీమతి సోనియా గాంధీ నాయకత్వంలో, అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో 2006 ఫిబ్రవరి 2న అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో ఈ పథకాన్ని ప్రారంభించి కాంగ్రెస్ పార్టీ చట్టబద్ధత కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం గాంధీ పేరు తొలగించి కొత్త పేరుతో పథకాన్ని తీసుకురావడం గాంధీ సిద్ధాంతాలకు విరుద్ధమని విమర్శించారు.

గతంలో ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను అనుసరించిన నాథురాం గాడ్సే గాంధీజీని హత్య చేయడం దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని, నేటి పాలకులు కూడా అదే సిద్ధాంతాల ప్రభావంలో గాంధీ పేరును తొలగిస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో దేశ ప్రజలు బీజేపీని అధికారంలో నుంచి తొలగించి తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్, ఇమ్రాన్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, ఉమ్మడి జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మన్సూర్, షేక్ ఇమ్రాన్, సే ఖాసిం తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్ వారి చే అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం

మనగళం శ్రీశైలం : శ్రీమతి కె. లక్ష్మిఅపర్ణ, హైదరాబాద్ వారు ఈ రోజు (30.01.2026 ) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,005/-లను అందజేశారు. ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు కె. అయ్యన్నకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.



# ఈనాడు ప్రతిభా పోటీలలో కేశవరెడ్డి విద్యార్థుల ప్రతిభ








మన గళం : ఈనాడు పత్రిక వారు శుక్రవారం ఈనాడు ప్రతిభ అనే పేరుతో క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ పోటీలలో నగరంలోని వెంకట రమణ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వక్తృత్వపు పోటీలలో యు. పావని (9తరగతి) మొదటి స్థానం సాధించగా,బి. దీక్షిత (9 తరగతి ) జీ.కే. క్విజ్ లో మొదటి స్థానం సాధించగా,జె.రూహిత (8తరగతి) చిత్రలేఖనం లో తృతీయా స్థానాలను కైవసం చేసుకుని డిప్యూటీ డిఇఓ శ్రీధర్ గారి చేతులమీదుగా బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు యన్. కేశవరెడ్డి మాట్లాడుతూ ఈనాడు పత్రిక వారు ఈనాడు ప్రతిభ అనే పేరుతో నిర్వహించిన వ్యాస రూప, జనరల్ నాలెడ్జ్, చిత్రలేఖనం పోటీలలో విద్యార్థులు పాల్గొనడం వలన వారిలో సృజనాత్మకతతో పాటు ఆలోచన శక్తిని ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో తమ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తూ వారిని ఆయా విభాగాలలో ప్రోత్సహిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా తమ పాఠశాలలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు. అందులో భాగంగానే తమ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలవడం ఎంతో హర్షించ దగినదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సై డివై స్వామిని సత్కరించిన ధర్మపురి ఆలయ కమిటీ



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలో ఉత్తమ పోలీసు సేవలు అందించినందుకు గాను ఎస్సై డివై స్వామికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం కోడుమూరు ధర్మపురి క్షేత్ర శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై డి వై స్వామిని శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు విజయ భాస్కర్ రెడ్డి, జొన్నలగడ్డ కిరణ్ కుమార్, కాటేగారి గోపి, జీతూరి వేణు తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక సేవా పురస్కారాలు అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

# జాతిపిత మహాత్మా గాంధి వర్ధంతి

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్ధంలో సామూహిక నిరసన దీక్ష.
- మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం యధావిధిగా కొనసాగించాలి.
- కొత్త పథకం విబి - జి రామ్ జి బిల్లు రద్దు చేయాలి.
- 200 రోజులు పని దినాలు కల్పించాలి.
- రోజు కూలి 800 రూపాయలు ఇవ్వాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారణకు - కేంద్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలి.




(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో సామూహిక నిరసన దీక్ష భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. భూపేష్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుచేసి విబిజి రామ్ జి అనే కొత్త బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఈ కొత్త బిల్లు వలన ఉపాధి హామీ కూలీలకు ఒరిగిందేమి ఉండదు. వేతనాలు పెరుగుదల పని దినాల తెంపు సవ్యంగా లేకపోవడం సగటు వేతనం 240 తగ్గించడం జరిగింది. ఉపాధి హామీ కూలీలపై కేంద్ర ప్రభుత్వం సీత కన్ను వేసింది చట్టం పదం వాడకుండా పథకం అనే పదం వాడడానికి ప్రయత్నం చేస్తున్నది అందువల్ల రాను రాను పని అనే గ్యారెంటీ అనేది తీసేస్తారేమో అని అనుమానం కూడా ఉంది. రాష్ట్రాల మీద భారం మోపి విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గత యూపీఏ ప్రభుత్వంలో చట్టం తెచ్చినప్పుడు కేంద్రం 90% నిధులు రాష్ట్రాలు 10% నిధులు ఉపాధి హామీకి కేటాయించాలని నిర్ణయిస్తే ప్రస్తుతం మోడీ ప్రభుత్వం రాష్ట్రాల మీద భారం పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది వేతనాలు కూడా ఇంతకు మునుపు వస్తున్న 260 రూపాయల సగట వేతనం కాకుండా 240 రూపాయల సగటున వచ్చే విధంగా కేంద్రం కుట్రలు పన్నుతున్నది అయితే చట్టాన్ని ప్రజల ముందు బయట పెట్టకుండా ప్రజలు మేధావులు పౌర సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు స్వచ్ఛంద సంస్థలు రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోకుండా ఆమోదం పొందింది గత యూపీఏ ప్రభుత్వం చట్టం తెచ్చేముందు దేశంలో అందరి అభిప్రాయాలు తీసుకున్నది. నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదల పట్ల నియంతృత్వ ధోరణి కనపరిచారు ఆ విధమైన అభిప్రాయాలు కేంద్ర ప్రభుత్వం తీసుకునే పనిలో లేనట్లు కనబడుతున్నది కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేస్తున్న మోసాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గట్టిగా అడగాల్సిన అవసరం ఉంది రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు మా దగ్గర డబ్బులు లేవని బీద అరుపులు అరుస్తున్నప్పుడు కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎలా భరిస్తారు ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ఉపాధి హామీ బడ్జెట్ కి పదివేల కోట్ల అవసరం ఉంటుంది మరి అలాంటప్పుడు కేంద్ర ప్రభుత్వం వేస్తున్న భారాలు రాష్ట్ర ప్రభుత్వానికి ఆమోద యోగ్యము కాదు కూటమి ప్రభుత్వం కూడా ఎన్డీఏలో భాగ్య స్వామి కాబట్టి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసపూరితమైన కుట్రను వ్యతిరేకించాలి అడగకపోతే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ఉపాధి కూలీలకు నష్టం కలిగించే కొత్త చట్టం ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయం సరైనది కాదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, సహాయ కార్యదర్శి ఎస్ఎస్ భాష, ఏఐటీయూసీ తాలుక కార్యదర్శి రంగన్న, రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు చంద్రకాంత్ రెడ్డి, చాపల గోపాల్, సిద్ధిలింగ, ఉలిగప్ప, రామాంజి, ఈరన్న, రాముడు, శివ, మల్లేష్, తులసమ్మ, హుస్సేనమ్మ, రాజి, నాగేశ్వరమ్మ, లక్ష్మి, ప్రభావతి, శశికళ, యశోదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత ఉద్యమకారులపై ఏఎస్ఐ దాడి యత్నం

- ఏఎస్ఐ దురుసు ప్రవర్తనపై ఎస్సైకు ఫిర్యాదు.. జేఏసీ నేతలు.
- పోలీస్ స్టేషన్‌లోనే ప్రజాస్వామ్యంపై దాడి.
- ఏఎస్ఐ పై చర్యలు కోరిన..బీకేఎంయూ నేత భూపేష్.



(ఆలూరు మనగళం): ఆలూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.ఎస్.ఐ చంద్రశేఖర్ ప్రజాస్వామ్య ఉద్యమాలపై అణిచివేత ధోరణితో వ్యవహరించారని వ్యవసాయ కార్మిక సంఘం (దీఖవీఖ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.భూపేష్ తీవ్రంగా ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎస్సై మన్మథ విజయ్‌కు ఫిర్యాదు చేశారు..ఆదోనిని జిల్లాగా ప్రకటించాలనే న్యాయమైన డిమాండ్‌తో జనవరి 24న నిర్వహించిన ఆలూరు బంద్‌లో తాను శాంతియుతంగా పాల్గొనగా, అప్పుడే ఏఎస్ఐ చంద్రశేఖర్ బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా జనవరి 30న వ్యవసాయ కార్మిక సంఘం సామూహిక దీక్షలకు అనుమతి కోరేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో తీవ్ర వ్యక్తిగత దూషణలు చేస్తూ దాడికి కూడా యత్నించారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లోనే ప్రజాస్వామ్య ఉద్యమ నాయకుడిపై ఈ తరహా దురుసు ప్రవర్తన పోలీస్ వ్యవస్థ ప్రతిష్టను దిగజార్చుతోందని భూపేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఏఎస్ఐ చంద్రశేఖర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై ను కోరారు. న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీకేఎంయూ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతు సంఘం తాలూకా కార్యదర్శి రంగన్న, జేఏసీ నేతలు కత్తి రామాంజనేయులు, పూల రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్న, వైఎస్ఆర్సిపి ఆర్టి విభాగపు జిల్లా నాయకులు కొట్టాల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉత్తేజానిచ్చిన వ్యాసరచన వ్రక్తుత్వ చిత్రలేఖన పోటీలు



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరిమాత జాతర ఫిబ్రవరి 2వ తేదీ మూడో తేదీ జరుగుతున్నది ఈ తిరుణాల సందర్భంగా కోడుమూరు సాంస్కృతిక క్రీడల అభివృద్ధి కమిటీ వారుశ విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు , ప్రక్తుత్వ పోటీలు, చిత్రలేఖనం పోటీలు స్థానిక జివిఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రారంభం శుక్రవారం ఉదయం 11 గంటలకు మన ఊరు మన జాతర కార్యక్రమాల్లో భాగంగా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే . రామచంద్రుడు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు విద్యార్థులు, స్కూల్ యాజమాన్యం నుండి విశేష స్పందన లభించింది. వ్యాసరచన పోటీలకు వందేమాతరానికి 150 సంవత్సరాలు అనే అంశాన్ని విద్యార్థులకు ఇచ్చారు ఈ వ్యాసరచన పోటీలకు 223 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రకృత్వ పోటీలకు ఆపరేషన్ సిందూర్ అనే అంశాన్ని శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ వారు విద్యార్థులకు ఇచ్చారు ఈ పోటీలకు 75 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా న్యాయవాదులు జి.పవన్ చంద్రా రెడ్డి, బి.సి.రాజు, ఎం. అనీష్ లు పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అలాగే మూడవ పోటీ అయిన చిత్రలేఖనం పోటీలకు భారత గ్రామీణ ప్రజల జీవనశైలి అనే అంశాన్ని విద్యార్థులకు ఇచ్చారు ఈ



పోటీలకు సుమారు 302 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా. ఆర్టిస్ట్ లు అప్సర్ భాషా, లక్ష్మన్న, కార్టూనిస్ట్ లక్ష్మణ్ వ్యవహరిస్తున్నారు. రెండు రోజుల్లో పలితాలు విడుదల చేస్తామని శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. బహుమతులను ఫిబ్రవరి 3వ తేదీన జరిగే డ్యాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమంలో అందచేస్తారు అలాగే ఈ పోటీల లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించే దాతలకు కోడుమూరు శ్రీ చౌడేశ్వరి దేవి తిరునాల క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

శనివారం
31 - 01 - 2026

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## వన్యప్రాణి సంరక్షణే మానవ భవిష్యత్తుకు భరోసా

ప్రపంచ పర్యావరణ అవగాహన అంశాలకు అనుసంధానమైన ఈ రోజు, ముఖ్యంగా అడవి జంతువుల సంరక్షణపై ప్రపంచాన్ని ఆలోచనకు నడిపించే సందర్భం. జీబ్రా దినోత్సవం పేరుతో మొదలైన ఈ అవగాహన దినం, కేవలం ఒక జంతువు పరిరక్షణకే పరిమితం కాకుండా, భూమిపై ఉన్న మొత్తం జీవ వైవిధ్యానికి సంబంధించిన హెచ్చరికగా మారుతోంది. అడవులు, వన్యప్రాణులు, సహజ వనరులు మనిషికి ప్రత్యక్షంగా కనిపించకపోయినా, అతని జీవనాధారాలతో అవి గట్టిగా ముడిపడి ఉన్న వాస్తవాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది.

అడవి జంతువులు ప్రకృతిలో సమతుల్యతను కాపాడే కీలక పాత్ర పోషిస్తాయి. ఒక జంతు జాతి అంతరించిపోతే, దాని ప్రభావం ఆహార గొలుసు అంతటా వ్యాపిస్తుంది. అడవుల్లో ఉండే ప్రతి జీవి ప్రకృతి వ్యవస్థలో ఒక భాగం. వాటిని కోల్పోవడం అంటే ప్రకృతి వ్యవస్థలోని సమతుల్యతను దెబ్బతీయడమే. నేటి వేగవంతమైన అభివృద్ధి, అటవీ నరికివేత, గనులు, పరిశ్రమలు, అక్రమ వేటల కారణంగా అనేక వన్యప్రాణులు అంతరించిపోతున్న దశలో ఉన్నాయి.

అభివృద్ధి అవసరం కాదనలేం. కానీ అభివృద్ధి పేరుతో అడవులను నాశనం చేయడం భవిష్యత్తును తాకట్టు పెట్టడమే. అడవులు కేవలం జంతువులకు మాత్రమే కాదు, మనిషికి కూడా ఆక్సిజన్, వర్షాలు, నీటి వనరులు అందించే సహజ రక్షణ కవచాలు. అడవులు తగ్గితే వాతావరణ మార్పులు, కరువులు, వరదలు వంటి విపత్తులు పెరుగుతున్నాయన్నది ప్రపంచం ఎదుర్కొంటున్న నిజం. ఈ నేపథ్యంలో వన్యప్రాణి సంరక్షణ అనేది భావోద్వేగ అంశం కాదు, జీవన అవసరం.

నేటి సమాజంలో అడవి జంతువులు మనుషుల శత్రువుల్లా చూపించే ధోరణి పెరుగుతోంది. కానీ నిజానికి అడవుల్లోకి మనిషే చొచ్చుకుపోయి, వాటి నివాసాలను నాశనం చేస్తున్నాడు. ఆహారం, నీరు కోసం జంతువులు గ్రామాల వైపు రావడం సహజం. దీనిని సమస్యగా కాకుండా హెచ్చరికగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రకృతితో సహజీవనం చేయడం నేర్చుకోకపోతే, ఈ ఘర్షణలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వాల బాధ్యత ఎంతైతే, సమాజం పాత్ర కూడా అంతే ముఖ్యమైనది. చట్టాలు ఉన్నా, అమలు లోపిస్తే ప్రయోజనం ఉండదు. అక్రమ వేట, అడవుల ఆక్రమణ, అడవి భూముల దుర్వినియోగం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రజల్లో అవగాహన పెంచాలి. అడవి అంటే భయపడాల్సిన ప్రాంతం కాదు, రక్షించాల్సిన సంపద అన్న భావనను బలంగా నాటాలి.

వన్యప్రాణుల పరిరక్షణతో పాటు సహజ వనరుల సంరక్షణ కూడా ఈ రోజున చర్చించాల్సిన అంశం. నీరు, నేల, అడవులు, గాలి అన్నీ పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. ఒకదాన్ని నిర్లక్ష్యం చేస్తే మిగతావన్నీ ప్రభావితమవుతాయి. నేటి తరానికి మాత్రమే కాదు, రాబోయే తరాలకు కూడా ఈ వనరులను భద్రపరచాల్సిన బాధ్యత మనపై ఉంది.

జీబ్రా దినోత్సవంతో అనుసంధానమైన ఈ ప్రపంచ పర్యావరణ అవగాహన దినం, మన జీవన విధానాన్ని ప్రశ్నించే రోజు. మనం ప్రకృతికి ఏమిస్తున్నాం? ఏమి తీసుకుంటున్నాం? అనే ఆలోచనకు ఇది దారి తీస్తుంది. ప్రకృతితో పోరాడితే మనిషే ఓడిపోతాడన్న సత్యాన్ని చరిత్ర ఇప్పటికే పలుమార్లు నిరూపించింది. అడవులు ఉంటేనే జీవితం ఉంటుంది. వన్యప్రాణులు ఉంటేనే ప్రకృతి సజీవంగా ఉంటుంది. ఈ సత్యాన్ని గుర్తించి, అభివృద్ధిపర్యావరణం మధ్య సమతుల్యత సాధించినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది. ప్రపంచ పర్యావరణ అవగాహన దినం ఈ బాధ్యతను ప్రతి ఒక్కరికి గుర్తుచేసే మౌన హెచ్చరిక. వన్యప్రాణుల పరిరక్షణతో పాటు సహజ వనరుల సంరక్షణ కూడా ఈ రోజున ప్రధాన అంశం. నీరు, నేల, అడవులు, గాలి అన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. అడవులు తగ్గితే నీటి వనరులు ఎండిపోతాయి. నేల సారవంతత తగ్గుతుంది. చివరకు వ్యవసాయం దెబ్బతింటుంది. ఇవన్నీ నేరుగా మనిషి జీవనంపై ప్రభావం చూపే అంశాలు. ప్రకృతిని రక్షించడం అంటే, మనిషి తన జీవనాధారాలను తానే రక్షించుకోవడమే.

నేటి యువతకు ఈ అంశంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం మరింత ఎక్కువ. పుస్తకాలలో చదివే పర్యావరణ పాఠాలు జీవితంలో ఆచరణలోకి రావాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, నీటి వృథాను నివారించడం, చెట్ల పెంపకం, అడవుల పరిరక్షణలో భాగస్వాములుగా మారడం వంటి చిన్న చర్యలే పెద్ద మార్పుకు దారితీయగలవు. వన్యప్రాణి సంరక్షణ అనేది అడవుల్లో మాత్రమే జరిగే పని కాదు, అది మన రోజువారీ జీవన విధానంతో ముడిపడి ఉంది.

జీబ్రా దినోత్సవంతో అనుసంధానమైన ఈ ప్రపంచ పర్యావరణ అవగాహన దినం, మనిషిప్రకృతి సంబంధాన్ని తిరిగి ఆలోచించమని పిలుస్తోంది.

ప్రకృతిని జయించాలనే భావన నుంచి, ప్రకృతితో కలిసి జీవించాలనే ఆలోచనకు మారాల్సిన అవసరం ఉంది. ప్రకృతితో పోరాడితే మనిషే ఓడిపోతాడన్న సత్యాన్ని ఇటీవలి విపత్తులు పదే పదే గుర్తుచేస్తున్నాయి. అడవులు ఉంటేనే జీవితం ఉంటుంది. వన్యప్రాణులు ఉంటేనే ప్రకృతి సజీవంగా ఉంటుంది. అభివృద్ధిపర్యావరణం మధ్య సమతుల్యత సాధించినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుంది. ప్రపంచ పర్యావరణ అవగాహన దినం మనందరికీ ఇచ్చే సందేశం ఒక్కటే ప్రకృతిని కాపాడితేనే మన భవిష్యత్తు కాపాడబడుతుంది.

## శ్రీశ్రీశ్రీ గంగా భవాని దేవాలయంలో ఘనంగా జరుపుకున్న భీష్మ ఏకాదశి వేడుకలు





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని స్థానికల శ్రీ శ్రీ శ్రీ గంగా మాత దేవాలయం నందు గురువారం రాత్రి భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు వారిని స్మరించుకుంటూ గంగా భవాని దేవాలయం నందు గంగాభవాని దేవాలయ గంగపుత్రులు మరియు స్థానికులు కలిసి ఈ భీష్మ ఏకాదశి వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీష్మ ఏకాదశి అనగా (మాఘ శుద్ధ ఏకాదశి) మహాభారతంలోని భీష్మ పితామహుడు అంపశయ్యపై ఉండి, శ్రీకృష్ణుని స్మరిస్తూ మోక్షం పొందిన పవిత్రమైన రోజు. ఈ రోజున విష్ణు సహస్రనామ పారాయణ, ఉపవాసం, దానధర్మాలు చేయడం ద్వారా పాపాలు నశించి, మోక్షం మరియు అదృష్టం కలుగుతాయని విశ్వాసం. ఇది శత్రు విముక్తిని, మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని నమ్ముతారు

భీష్మ ఏకాదశి విశిష్టతలు వారు తెలియజేశారు విష్ణు సహస్రనామ జయంతి రోజున భీష్ముడు పాండవులకు, శ్రీకృష్ణుని సమక్షంలో విష్ణు సహస్ర నామాలను బోధించిన రోజు ఇది అన్నారు అలాగే భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలంలో ఈ రోజున శరీరాన్ని వదిలి వైకుంఠ ప్రాప్తిని పొందారన్నారు ఈ భీష్మ ఏకాదశి రోజున విష్ణుమూర్తిని పూజించి, తులసి దళాలతో అర్చించడం, సత్యనారాయణ వ్రతం చేయడం మంచిది అని వారు తెలియజేశారు అలాగే భీష్మునికి తర్పణం వదలడం వల్ల పితృ దోషాలు తొలగిపోతాయని, సంతాన భాగ్యం కలుగుతుందని ఒక ప్రగాఢ నమ్మకం కలదని వారు ఈ సందర్భంగా తెలియజేశారు ఈ పవిత్రమైన రోజున విష్ణు సహస్రనామ పఠనం వల్ల అనేక జన్మల పాపాలు తొలగిపోతాయని పురాణాలు చెబుతున్నాయి ఈ కార్యక్రమంలో స్థానిక గంగ పుత్రులు మరియు దేవాలయ కమిటీ సభ్యులు భక్త బృందము పాల్గొన్నారు.

## తహసిల్దార్ బి నాగరాజుకు వినతి పత్రని అందజేసిన రాష్ట్రోపాధ్యాయ సంఘం



మన గళం కోడుమూరు: ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ (ాఖ ూా) పిలుపు ఇచ్చిన మూడు దశల పోరాటంలో భాగంగా మొదటి దశలో ఈరోజు 30.1.26 న

కోడుమూరు మండలం నందు ాఖ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీ ా.తిక్కన్న, వీ.రాఘవేంద్రుడు అధ్యక్షతన కోడుమూరు మండల తహసిల్దార్ నాగరాజు కి వినతి పత్రం సమర్పించారు రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి ఎ.తిమ్మన్న, జిల్లా గౌరవాధ్యక్షులు ఖ.తిరుమల రెడ్డి,జిల్లా అధనపు ప్రధాన కార్యదర్శి దీ.వేణుగోపాల్ జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ +.జ.నరసింహుడు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ాఖూా పూర్వపు ప్రధాన కార్యదర్శి ఎ తిమ్మన్న మాట్లాడుతూ జీవన వ్యయం నిరంతరం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో రాష్ట్రంలోని ఉద్యోగులు ఉపాధ్యాయ, పెన్షనర్ల క్రింది న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి 30% ×= ను ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు మరియు జూూ రద్దుచేసి ూూ అమలు చేయాలని అలాగే 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పోలీసులు మరియు ఇతర శాఖల ఉద్యోగులకు ూూ అమలు చేయాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వవలసిన గ్రాడ్యుటీని వెంటనే మంజూరు చేయాలని అలాగే ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు చెల్లించాల్సిన 4 ణూ లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండవ దశలో ఫిబ్రవరి 10 వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద జరిగే జిల్లాస్థాయి ధర్నా కార్యక్రమానికి మరియు మూడవ దశలో జరిగే ఫిబ్రవరి 25 వ తేదీ చలో విజయవాడ కార్యక్రమానికి ఎస్టీయూ నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులుఖ.గిడ్డయ్య, ఖ.=శేఖర్, ఎ.శివ శంకర్, దీ.ఆంజనేయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే కోట్ల



మన గళండోన్ డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు

ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా, ప్రజలు నీటి సరఫరా, రోడ్లు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కి వివరించారు.ఎమ్మెల్యే ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి అంటే మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం



మన గళం డోన్ మండలంలోని గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్లెం పల్లె గ్రామంలో ఆధ్వర్యంలో కోట్ల కు స లింద్రజయన్న, సలేంద్ర సుంకన్న, ఉన్నిగొర్ల శ్రీనివాసులు, ఉన్న గొర్ల సుధాకర్ ఆధ్వర్యం లో అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ప్రజల సమస్యల గురించి అడిగి కోట్ల తెలుసుకున్నారు. రోడ్లు త్రాగునీటి సమస్యను ప్రభుత్వ గృహ నిర్మాణం చేపట్టాలని పలువురు కోరారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.గ్రామస్థులు పెన్షన్లు, సాగునీరు, తదితర సమస్యలు కోట్ల దృష్టికి తెచ్చారు. 15 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డుకు కోట్ల ప్రారంభోత్సవం గా వించారు.ఈ కార్యక్రమంలో లక్కసాగరం లక్ష్మీ రెడ్డి, వలసల రామకృష్ణ, భూమా నాగన్న, సలేంద్ర శ్రీనివాసులు, అన్ని శాఖల అధికారులు , గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకు దీక్షలు కొనసాగిస్తాం

**– 50వ రోజుకు చేరుకున్న రిలే దీక్ష.**




(ఆలూరు మనగళం) : ఆదోని జిల్లాగా ప్రకటిస్థామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకు దీక్షలను కొనసాగిస్తామని ఆలూరు జేఏసీ నాయకులు కత్తి రామాంజనేయులు, ఎల్లప్ప, పూల రామాంజనేయులు, కొట్టాల రాజు తేల్చి చెప్పారు. ఆదోని జిల్లా సాధన కోసం ఆలూరులో సాగుతున్న రిలే దీక్ష శుక్రవారం 50వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షల్లో వారు మాట్లాడుతూ వెనుకబాటుకు గురైన ఆలూరు ప్రాంతం విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఆదోనిను జిల్లాగా ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం 5 నియోజకవర్గాల ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకోవాలన్నారు. దీక్షల్లో వివిధ పార్టీల నాయకులు చంద్రకాంత్ రెడ్డి, గోపాల్, బసిరెడ్డి, లక్ష్మన్న, ఆలూరు జె ఏ సి నాయకులు కత్తి రామాంజనేయులు, భూపేష్, ఎల్లప్ప అన్నారు. ఆదివారం ఆలూరు జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష 45వ రోజుకు చేరుకుంది ఈ దీక్షలో ఆలూరు మండలం మరకట్టు గ్రామ మాజీ సర్పంచ్ ఎల్లప్ప అద్వర్యంలో రైతులు పెద్ద లక్షన్న , షేక్షావలి, పుచ్చిరప్ప, భీమ లింగప్ప, వీరేష్, చంద్రప్ప, బుజ్జరాజు ,రంగన్న, మాల ఎల్లప్ప కూర్చున్నారు. వీరికి సామాజిక కార్యకర్త కమలాకర్ నాయుడు, వైసీపీ నాయకులు కొట్టాల రాజు సంగీబావం ప్రకటించారు. 5 నియోజక వర్గాల

ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఆదోనిను జిల్లా గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో వివిధ పార్టీల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు బసిరెడ్డి, ప్రసాద్, లక్ష్మన్న, చాంద్రకాంత్ రెడ్డి, చాపల గోపాల్, అంజినెయ్య, రామప్ప, చలపతి, రాముడు, మునేప్ప, మల్లికార్జున గౌడ పాల్గొన్నారు.

# చుక్క పాలు లేకుండా నెయ్యి తయారు చేయటం వైసిపి ప్రభుత్వానికి అలవాటే...





**టిడిపి మండల నాయకులు...**

నందవరం జనవరి 30 మనగళం న్యూస్ : నందవరం మండలంలోని టిడిపి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేశాయ్ మాధవరావు తను ఇంటి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైస్ మిల్ నారాయణరెడ్డి మాజీ జెడ్పిటిసి ఈరన్న గౌడ్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మీ వైసిపి ప్రభుత్వం లో మీరు చేసిన పాపాలు మీ చిన్నాన్నను ఇంట్లో మీరు చంపుకుంటే ఆరోజు మీ గత వైసిపి ప్రభుత్వంలో ఉన్న సాక్షాలు మీకు అంత తెలుసు కాబట్టి ఈరోజు ఎంతో పవిత్రంగా కొలిచే శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డును మీరు రసాయన కెమికల్స్ తో తయారు చేయించి వచ్చిన భక్తులకు లడ్డూలను అమ్ముకొని సొమ్మును చేసుకోవడం మీకు అలవాటేనని తెలియజేశారు పవిత్రంగా కొలిచే దేవుని ప్రసాదంలో ఎక్కువ రసాయనాలు కలిపి వచ్చినటువంటి భక్తులకు రసాయనాలు కలిపిన కెమికల్స్ లడ్డును వచ్చినటువంటి భక్తులకు అమ్ముతుంటే దేవుడు చూసి ఒకనే ఉంటాడా అందుకోసమే మీకు గత ప్రభుత్వంలో 150 సీట్లు గెలుపు పొందిన మీరు మొన్న జరిగిన ఎలక్షన్లో మాత్రం 11 సీట్లకు పరిమితిమయ్యారని తెలియజేశారు వైసీపీ గద్దెనెక్కిన టీటీడీ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు, కల్తీకి రహదారి నిర్మించారు. తిరుమలను అక్రమాల పుట్టగా మార్చుకున్నారు. 'విచిత్ర కంపెనీలతో ఎటువంటి లోతు విచారణ జరపకుండా టెండర్లు కట్టబెట్టారు అర్హత లేకపోయినా భారీ ఎత్తున టెండర్ కట్టబెట్టారు ఈ కుంభకోణంలో రూ.235 కోట్ల స్వామివారి నిధుల దుర్వినియోగం చేసారు వైసీపీ ప్రభుత్వం టెండర్లలో పాల్గొనే డెయిరీ పాలు సేకరించాల్సిన పనిలేదని, వెన్న సేకరణ,నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేదని, డెయిరీ మూడేళ్ల కార్యకలాపాలు చేయక్కర్లేదని,

ఏడాది చాలని, రూ.250 కోట్ల టర్నోవర్ అవసరం లేదని, రూ.150 కోట్లు ఉంటే చాలని నిబంధనలు మార్చేసింది ఐదేళ్లు హిందూమతంపై, హిందూ దేవుళ్లపై,పూజారులపై దాడులు చేసారు చిన్న కేసు కదా.అని పరకామణిలో దొంగతనం చేసిన వాళ్లను వెనుకేసుకొస్తారు బంగారం తాపడం అని ఏకంగా స్వామి వారికి బురిడీ తొడుగు తొడిగారు పట్టు లేకుండా నకిలీ పట్టు వస్త్రాలు ఇచ్చి కోట్లు దోచుకున్నారు టీటీడీలో అన్యమతస్థుల నియామకం, బస్సు టికెట్లపై అన్యమత ప్రచారం, తిరుమల కొండపై అన్యమత గుర్తు టీటీడీ వెబ్ సైట్లో అన్యమత బోధనలు, భక్తుడికి అశ్లీల వెబ్ సైట్ లింక్ పంపడం దర్శనం వసతి అద్దె, టోల్, ప్రసాదాల ధరలు పెంచడం వంటి అనేక ఘటనలు గత ప్రభుత్వంలో తిరుమల పవిత్రతను దెబ్బతీశాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించాల్సి ఉన్నా జగన్మోహన్ రెడ్డి మాత్రమే పట్టు వస్త్రాలు ఇచ్చి హిందూ సంప్రదాయాలను జగన్ రెడ్డి గారు కాలరాశాడు.రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం, అంతర్వేది రథం దగ్ధం, సింహాచలం అపవిత్రత, దుర్గ గుడిలో వెండి సింహాల చోరీ వంటి వాటిని జగన్ రెడ్డి గారు ప్రోత్సహించాడు కాబట్టే వైసీపీ పాలనలో, భారతదేశ చరిత్రలో ఎక్కడా ఎన్నడూ జరగని విధంగా ఆంధ్రప్రదేశ్లో దేవాలయాలు, హిందూ మతంపై దాడులు జరిగాయి తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ





మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (30.01.2026 ) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయలసేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి.. పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

# నందీశ్వరస్వామివారికి విశేషపూజలు



మనగళం శ్రీశైలం : ఈ రోజు (30.01.2026) ఉదయానికి త్రయోదశి రావడంతో నందీశ్వరస్వామి వారికి పరోక్షసేవగా విశేషార్చన జరిపించబడుతోంది. ప్రతీ మంగళవారం రోజున మరియు త్రయోదశిరోజులలో దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. అయితే ప్రతి నెలలో కూడా త్రయోదశి రోజులలో అనగా శుద్ధ త్రయోదశి మరియు బహుళ త్రయోదశి రోజులలో భక్తులు నందీశ్వరస్వామివారి పూజను పరోక్షసేవగా జరిపించుకునే అవకాశం కూడా కల్పించబడింది. కాగా ఈ రోజు మొత్తం 80 మంది భక్తులు పరోక్షసేవగా ఈ నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకుంటున్నారు. ఈ పరోక్షసేవలో తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, న్యూఢిల్లీ నుండి కూడా భక్తులు ఈ విశేషపూజను నిర్వహించుకుంటున్నారు. ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతోంది. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను జరిపించబడుతోంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది. వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది. కాగా త్రయోదశి రోజున జరిపించబడే నందీశ్వరస్వామివారి పరోక్షసేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116/-లను సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది.భక్తులు సేవారుసుమును లేదా ద్వారా చెల్లింపు చేయవచ్చు. నందీశ్వరస్వామివారి ఆరాధన వలన సంతానంలేనివారికి సంతానం కలుగుతుందని, సమస్యలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని, ఋణబాధలు తీరుతాయని, అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని, కష్టాలు నివారించబడతాయని, మానసిక ప్రశాంతత చేకూరుతుందని పండితులు పేర్కొంటున్నారు.అదేవిధంగా ఈ స్వామికి నానబెట్టినశనగలను సమర్పించడం వలన కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది. అందుకే ఈ స్వామివారికి శనగలబసవన్న అనే పేరు కూడా ప్రసిద్ధంగా ఉంది. ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతున్నది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును. కావున భక్తులందరు కూడా ఈ పరోక్షసేవను సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాము. ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 లను సంప్రదించవచ్చును.

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (30.01.2026) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలముతో విశేషఅభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## అల్లు అర్జున్ జోడీగా శ్రద్ధా కపూర్..

\- లోకేష్ భారీ ప్లాన్.. డబుల్ సెన్సేషన్..!



హైదరాబాద్ 30 జనవరి 2026 :మన గళం : టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు కోలీవుడ్ సెన్సేషనల్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే ప్రతిష్టాత్మక చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఏఏ23 వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో కథానాయికగా బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్‌ను ఎంపిక చేసినట్లు వినిపిస్తున్న వార్తలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

ఇటీవల భారీ విజయాన్ని అందుకున్న శ్రద్ధా కపూర్ ఇప్పటికే ప్రభాస్‌తో కలిసి నటించిన అనుభవం ఉండటంతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. ఇప్పుడు అల్లు అర్జున్ సరసన నటించే అవకాశం దక్కితే టాలీవుడ్‌లో మరోసారి సెన్సేషన్ ఖాయం అనే టాక్ వినిపిస్తోంది. లోకేష్ కనగరాజ్ సినిమాల్లో సాధారణంగా హీరో క్యారెక్టర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర చాలా కీలకంగా, బలమైన ప్రాధాన్యంతో ఉంటుందని సమాచారం. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాతో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా పూర్తైన తర్వాత లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్‌పై పూర్తి దృష్టి పెట్టనున్నాడు. ఈ చిత్రం లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగమా లేక ప్రత్యేకంగా రూపొందించే స్వతంత్ర చిత్రమా అనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అయినప్పటికీ అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్, శ్రద్ధా కపూర్ కాంబినేషన్ ఖరారైతే బాక్సాఫీస్ వద్ద భారీ అంచనాలు నెలకొనడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## టాలీవుడ్‌లోకి రవీనా టాండన్ కూతురు ఎంట్రీ..

నగరం 30 జనవరి 2026 ,మనగళం :

ఆర్ ఎక్స్ 100, మంగళవారం వంటి సంచలన చిత్రాలతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం శ్రీనివాస మంగాపురం. వైజయంతి ఫిల్మ్స్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రంతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగిన వేళ, తాజాగా కథానాయికను పరిచయం చేస్తూ మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇచ్చారు.

ఈ చిత్రంతో బాలీవుడ్ స్టార్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ తొలిసారిగా టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది. లవ్ అండ్ యాక్షన్ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో రాషా 'మంగ' అనే పవర్‌ఫుల్, ఎలిగెంట్ పాత్రలో నటిస్తోంది. ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కోటి మంది దేవతలు నా పక్కనుండి వెళ్లినా నేను మాత్రం నిన్నే చూస్తూ ఉంటా అనే డైలాగ్‌తో హీరో శ్రీను ఆరాధించే తీరు, కథలో మంగ పాత్రకు ఉన్న ప్రాధాన్యతను స్పష్టంగా చూపిస్తోంది.

ఈ భారీ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, అశ్విని దత్ సమర్పణలో వైజయంతి ఫిల్మ్స్, స్వప్న సినిమా, చందమామ కథలు బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన జయకృష్ణ ఫస్ట్ లుక్, టీజర్‌లకు మంచి స్పందన లభించగా, ఇప్పుడు రాషా ఎంట్రీతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి.



## రజినీకమల్ మల్టీస్టారర్ మళ్లీ హాట్ టాపిక్..



హైదరాబాద్ 30 జనవరి :మన గళం :భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన భారీ చిత్రాల ట్రెండ్ కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది.

ముఖ్యంగా అగ్ర కథానాయకులు కలిసి నటిస్తే ఆ ప్రాజెక్ట్ విడుదలకు ముందే విపరీతమైన హైప్ ఏర్పడుతోంది. అలాంటి అత్యంత క్రేజీ కాంబినేషన్‌గా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా మరోసారి చర్చకు వచ్చింది.

గతంలో ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ చేయబోతున్నారన్న వార్తలు సంచలనం సృష్టించాయి. తాజాగా ఆ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై మళ్లీ ఊపు వచ్చిందని తమిళ సినీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ భారీ చిత్రాన్ని జైలర్ సినిమాతో సంచలన విజయాన్ని అందుకున్న దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్లు గట్టి ప్రచారం జరుగుతోంది. ఈ వార్తలకు బలం చేకూర్చేలా, రజినీకాంత్ కమల్ హాసన్ కలయికలో రూపొందబోయే సినిమాకు సంబంధించి ఒక ప్రత్యేక విజువల్ లేదా అనౌన్స్మెంట్ కట్‌ను నెల్సన్ ఇప్పటికే సిద్ధం చేస్తున్నాడన్న టాక్ కూడా నడుస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువేనని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ జైలర్ రెండో భాగంతో పాటు ఇతర చిత్రాల పనుల్లో బిజీగా ఉండటంతో, అవి పూర్తైన తర్వాతే ఈ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే ఛాన్స్ ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాదు, సినీ చరిత్రలో నిలిచిపోయే ఘట్టంగా మారుతుందన్న నమ్మకం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది. అయితే ఇప్పటివరకు ఇవన్నీ ఊహాగానాలే కావడంతో, అసలు నిజం ఏంటన్నది అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.




## ఓటీటీలోకి 'నారి నారి నడుమ మురారి'..

హైదరాబాద్, 30 జనవరి:మన గళం : చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన ఫ్యామిలీ కామెడీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి' ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా 14 జనవరి న విడుదలైన ఈ చిత్రం థియేటర్లలో ఘన విజయం సాధించి సంక్రాంతి విన్నర్‌గా నిలిచింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్ర డిజిటల్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో భారీ ధరకు సొంతం చేసుకుంది. ఫిబ్రవరి 4 నుంచి ఈ సినిమాను తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ చిత్రంలో సాక్షి వైద్య, సంయుక్త మీనన్ కథానాయికలుగా నటించగా, వెన్నెల కిశోర్, సత్య, సునీల్, నరేష్‌ల కామెడీ ట్రాక్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. అలాగే శ్రీవిష్ణు అతిథి పాత్రలో కనిపించి సర్‌ప్రైజ్ ఇచ్చాడు. కథ విషయానికి వస్తే గౌతమ్ అనే ఆర్కిటెక్ట్ పాత్రలో శర్వానంద్ నటించాడు. తాను పనిచేసే ఆఫీసులోనే నిత్యతో ప్రేమలో పడతాడు. వీరి ప్రేమ సాఫీగా సాగుతున్న సమయంలో అదే ఆఫీసుకు టీమ్ లీడర్‌గా గౌతమ్ మాజీ ప్రేయసి దియా ఎంట్రీ ఇస్తుంది. దీంతో గౌతమ్ జీవితం ఇద్దరు భామల మధ్య ఎలా నలిగిపోయింది, తన గతాన్ని ప్రస్తుత ప్రేమకు ఎలా దాచాడు, చివరకు ఎవరి వైపు మొగ్గుచూపాడు అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది.

## పేరు మార్చుకోనున్న సమంత..?

హైదరాబాద్ 30 జనవరి :మన గళం : టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. గత ఏడాది డిసెంబర్ నెలలో బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. అత్యంత సన్నిహితుల మధ్య కోయంబత్తూర్‌లోని ఈషా ఫౌండేషన్‌లో, సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆశీస్సులతో ఈ వివాహం సాదాసీదాగా జరిగింది. వివాహం తర్వాత కూడా సమంత తన సినీ కెరీర్‌లో చురుగ్గా కొనసాగుతూ కొత్త చిత్రాలపై దృష్టి పెట్టారు. ఇదిలా ఉండగా, సమంత తన పేరులో మార్పు చేసుకోనున్నారన్న వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సమంత అసలు పేరు సమంత రూత్ ప్రభు. తాజాగా రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం, తన భర్త ఇంటిపేరును తన పేరు చివర చేర్చుకోవాలని ఆమె నిర్ణయించుకున్నట్టు సమాచారం. దీంతో ఇకపై ఆమె పేరు సమంత నిడిమోరుగా మారే అవకాశముందని తెలుస్తోంది.

ప్రస్తుతం సమంత 'మా ఇంటి బంగారం' చిత్రంలో నటిస్తున్నారు. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాజ్ నిడిమోరు క్రియేటర్‌గా, సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టైటిల్స్‌లో సమంత పేరు సమంత నిడిమోరుగా కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



# శ్రీశైల మల్లన్నకు స్వర్ణరథోత్సవం





మనగళం శ్రీశైలం : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (30.01.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.
అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. ,ఎఅనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా రథోత్సవంలో సంప్రదాయ నృత్యం, ఏర్పాటు చేయబడింది. ఈనాటి స్వర్ణరథోత్సవంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్నాయుడు, కార్యనిర్వహణాధికారి



శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్ట పునరుద్ధరణకు ఫిబ్రవరి 2 నుంచి పరిరక్షణ యాత్ర

బండ్లపల్లి నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్రను విజయవంతం చేసే దిశగా కార్యాచరణపై చర్చించారు. మన్రేగా చట్టం ద్వారా పేదలు, కూలీలకు అందుతున్న ఉపాధి, ఆదాయ భద్రత అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకం ఎంత కీలకమో వివరించాలని సూచించారు. అదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వి.బి. జి. రామ్ జి (గ్రామ్ జి) చట్టం వల్ల ఉపాధి హామీ లబ్ధిదారులకు జరుగుతున్న నష్టాలను స్పష్టంగా వివరించాలని నిర్ణయించారు. ఈ చట్టం ద్వారా గ్రామీణ ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడుతోందని, దీనిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. ఈ యాత్ర ద్వారా గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేసేలా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని, ఉపాధి హామీ చట్ట పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా కార్యాచరణ సాగాలని పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రజల హక్కుల కోసం ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## బడ్జెట్ టెన్షన్.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..

హైదరాబాద్ 30 జనవరి 2026: మనగళం, కేంద్ర బడ్జెట్ 2026 సమీపిస్తున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లలో అప్రమత్తత పెరిగింది. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా మెటల్ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో సూచీలపై తీవ్ర ప్రభావం పడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 269 పాయింట్లు నష్టపోయి 82269 వద్ద నిలిచింది. నిఫ్టీ 98 పాయింట్లు తగ్గి 25320 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో మిశ్రమ పరిస్థితి కనిపించింది. మిడ్‌క్యాప్ సూచీ స్వల్ప నష్టాన్ని నమోదు చేయగా, స్మాల్‌క్యాప్ సూచీ లాభాలతో ముగిసింది. రంగాల వారీగా చూస్తే మెటల్ సూచీ ఏకంగా భారీగా పతనమైంది. ప్రపంచ వృద్ధిపై ఆందోళనలు, అమెరికా బాండ్ యీల్డ్స్ పెరుగుదల కారణంగా ఐటీ రంగంలోనూ బలహీనత కనిపించింది. అయితే మీడియా, ఎఫ్‌ఎంసీజీ, వినియోగ వస్తువుల రంగాలు లాభాల్లో నిలిచాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గడంతో రూపాయి డాలర్‌తో పోలిస్తే 15 పైసలు బలపడింది. బ్యాంకింగ్ రంగంలో మాత్రం కొంత స్థిరత్వం కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# ఆలూరులో ఐదు తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

**– పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కమ్మ సరోజమ్మ.**

(ఆలూరు మనగళం): కర్నూలు జిల్లా, ఆలూరు పట్టణంలో ఎల్లార్తి రోడ్డులో ఉన్న కమ్మ వెంకట రాముడు భార్య సరోజమ్మ గొంతులో చైన్ తెంపుకొని పోయిన చైన్ స్నాచర్లు, కారులో పరారయ్యారు. మద్యాహ్నం ఇంటి దగ్గరకు వచ్చి మీ ఇంటి పెద్దాయన నంబర్ చెప్పాలని అడిగి పేపర్ లో రాసివ్వమని అడుగగా పేపర్, పెన్ను కోసం ఇంట్లోకి వెళ్లిన సరోజమ్మ. సరోజమ్మ వెంటే వెళ్లి గొంతులో ఉన్న ఐదు తులాల బంగారు తాళిబొట్టు చైన్ ను లాక్కొని కారులో పరారైన దుండగులు. చైన్ స్నాచర్లు ముందుగానె ప్లానింగ్ లో ఉండి, సిద్ధంగా ఉంచిన కారులో పారిపోయారు. బయటకు వచ్చి దొంగ దొంగ అని అరవగా చుట్టూ ఎవరు లేకపోవడంతో చైన్ స్నాచర్లు సునాయాసంగా తప్పించుకెళ్లారు. సరోజమ్మ జరిగిన ఘటనను వెంటనే ఆలూరు పోలీసులకు తెలపగా



పోలీసులు చైన్ స్నాచర్ల కోసం ఆరా తీస్తున్నామని తెలిపారు.

## బియ్యం ఇచ్చే ఏటీఎంలు వచ్చేస్తున్నాయి!..




హైదరాబాద్ 30 జనవరి 2026 మనగళం : సాధారణంగా ఏటీఎం అంటే డబ్బులే గుర్తుకు వస్తాయి. కానీ ఇకపై బియ్యం, గోధుమలు కూడా గుర్తుకు రానున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగంగా ధాన్యం పంపిణీ చేసే ఏటీఎంలు దేశంలో అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఒడిశాలోని భువనేశ్వర్‌లో తొలి ధాన్యం ఏటీఎంను ఏర్పాటు చేయగా, ఇప్పుడు బీహార్ రాజధాని పాట్నాలో మూడు ధాన్యం ఏటీఎంలను ప్రారంభించేందుకు అక్కడి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ఈ ధాన్యం ఏటీఎంలు జాతీయ ఆహార భద్రతా పథకం కింద లబ్ధిదారులకు నేరుగా బియ్యం, గోధుమలను పంపిణీ చేయడానికి రూపొందించారు. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు లేదా గుర్తింపు కార్డు ద్వారా గుర్తింపు ధృవీకరణ చేయించుకున్న తర్వాత, కావలసిన ధాన్యం రకం, పరిమాణాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఆ తరువాత యంత్రం స్వయంచాలకంగా ధాన్యాన్ని విడుదల చేస్తుంది. లావాదేవీ వివరాలు నమోదు అయి, లబ్ధిదారుడి ఖాతా అప్డేట్ అవుతుంది.

ఒక ధాన్యం ఏటీఎం ఐదు నిమిషాల్లో 50 కిలోల వరకు బియ్యం లేదా గోధుమలను పంపిణీ చేయగల సామర్థ్యం కలిగి ఉంది. విద్యుత్ వినియోగం చాలా తక్కువగా ఉండేలా రూపొందించగా, సౌర ఫలకాలు మరియు ఇన్వర్టర్ల సహాయంతో కూడా పనిచేయగలదు.

ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే బీహార్‌లోని ఇతర జిల్లాలకు కూడా ధాన్యం ఏటీఎంలను విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉంది. బీహార్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ కింద 8.5 కోట్లకు పైగా లబ్ధిదారులు, 50,000కు పైగా రేషన్ దుకాణాలు ఉన్న నేపథ్యంలో, ఈ ధాన్యం ఏటీఎంల ద్వారా అక్రమ రవాణా తగ్గుతుందని, పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఈ విధానం అమలులోకి వస్తే, రేషన్ కోసం క్యూలు, మధ్యవర్తుల ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులు నేరుగా ధాన్యం పొందే అవకాశం ఏర్పడనుంది.

# విద్యుత్ కారు కొనాలనుకుంటున్నారా?..

హైదరాబాద్ ,30 జనవరి 2026 ,మనగళం :మీరు విద్యుత్ కారు కొనాలని భావిస్తున్నట్లయితే ఇప్పుడే కొనకుండా కాస్త ఆగడం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో సరసమైన విద్యుత్ వాహనాలను ప్రోత్సహించే కీలక నిర్ణయాలు ఉండే అవకాశముందని అంచనా వేస్తున్నారు. పన్ను రాయితీలు, ప్రభుత్వ సబ్సిడీలు, సులభమైన ఫైనాన్సింగ్ విధానాల ద్వారా విద్యుత్ కార్ల ధరలు తగ్గే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. దేశంలో విద్యుత్ వాహనాలపై డిమాండ్ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, సామాన్యులకు అందుబాటులో ఉండే ఎంట్రీ స్థాయి విద్యుత్ కార్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టవచ్చని సమాచారం. దేశంలో అతిపెద్ద ఆటో సంస్థ అయిన టాటా మోటార్స్ ఇప్పటికే ప్రభుత్వాన్ని సరసమైన విద్యుత్ కార్లు, ఫ్లీట్ వినియోగానికి అనువైన విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలని కోరింది. ప్రయాణికుల వాహన మార్కెట్ క్రమంగా మెరుగుపడుతున్నప్పటికీ, తక్కువ ధర విద్యుత్ వాహనాలు ఇంకా సవాళ్లను ఎదుర్కొంటున్నాయని సంస్థ అభిప్రాయపడింది. టాటా మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ శైలేష్ చంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న తొలి చర్యలు ఆటో రంగానికి మేలు చేశాయని, అయితే సామాన్యులకు అందుబాటులో ఉండే విద్యుత్ కార్లకు మరింత మద్దతు అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రధాని ఈ డ్రైవ్ పథకం కింద కంపెనీలు, సంస్థలకు ఫ్లీట్ విద్యుత్ వాహనాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ పథకానికి ప్రభుత్వం 10000 కోట్ల బడ్జెట్ కేటాయించింది. అయితే సాధారణ ప్రయాణికుల విద్యుత్ కార్లను నేరుగా ఈ పథకంలో చేర్చలేదు. రాబోయే బడ్జెట్‌లో ఈ లోటును భర్తీ చేస్తే, దేశంలోని విద్యుత్ వాహన రంగానికి ఇది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. ఉత్పత్తి పెరగడం, కొత్త సాంకేతికత అభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టికి ఇది దోహదపడుతుందని అంచనా. సరైన పన్ను రాయితీలు, సబ్సిడీలు అమలైతే రాబోయే రోజుల్లో సరసమైన విద్యుత్ కార్లు సామాన్యుల ఇంటి ముందు నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.